


శ్లోకమే శ్వాసగా..
సంసార జీవితంలో నిత్యం బిజీగా గడిపే మహిళలు ఏడాది కాలంలో 700 శ్లోకాలు పఠించి ఔరా అనిపించారు. 8లో



పది అడుగులకు పెదవాగు
అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి సమీపంలోని పెదవాగు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరుతోంది. 8లో

వాతావరణం
గరిష్ఠం / కనిష్ఠం 31° / 25°

జిల్లాలో ఆదివారం పలుచోట్ల వర్షం కురిసేఅవకాశం ఉంది. ఆకాశం మేఘావృతంగా మారుతుంది.

న్యూస్‌రీల్

కమనీయంగా రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్‌: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో శనివారం రామయ్య నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. నిత్యకల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భద్రగిరిలో ఆషాఢ మాసోత్సవాలు ప్రారంభం

భద్రాచలంటౌన్‌: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో శనివారం ఆషాఢ మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆగస్టు 4వ తేదీ వరకు ఈ ఉత్సవాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని ఈఓ ఎల్‌.రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 21న దమ్మక్క సేవాయాత్ర, గురుపూర్ణిమ, శ్రీ గోవిదరాజ స్వామివారి వార్షిక తిరుకల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి
ఎస్పీ రోహిత్‌ రాజ్‌

భద్రాచలంఅర్బన్‌: నూతన న్యాయ చట్టాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఎస్పీ రోహిత్‌ రాజ్‌ సూచించారు. శనివారం ఆయన భద్రాచలం ఏఎస్పీ అంకిత్‌ కుమార్‌ సంక్వార్‌తో కలిసి కూనవరం రోడ్డులో నిర్మిస్తున్న కరకట్టను సందర్శించి, పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరిగితే లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేయాలని, ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని పోలీస్‌ శాఖ సిబ్బందికి సూచించారు. అనంతరం భద్రాచలం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గంజాయి, గుట్కా అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఉన్నతాధికారుల వల్ల, లేదా ఇతర కారణాలతో విధుల్లో ఇబ్బందులు పడుతుంటే తన దృష్టికి తేవాలని సిబ్బందికి సూచించారు. సీఐలు సంజీవరావు, నాగరాజు, ఎస్‌ఐలు విజయలక్ష్మి, మధుప్రసాద్‌ పాల్గొన్నారు.

10న స్పాట్‌ కౌన్సెలింగ్‌

భద్రాచలంటౌన్‌: ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్‌ కళాశాలల్లో ఇంటర్‌ ఫస్ట్‌ ఇయర్‌లో 2024 –25 విద్యా సంవత్సరానికి మిగిలిన సీట్ల భర్తీ కోసం స్పాట్‌ కౌన్సెలింగ్‌ నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్‌ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఒరిజినల్‌ సర్టిఫికెట్లతో భద్రాచలం గిరిజన గురుకుల కళాశాలలో ఈ నెల 10న నిర్వహించే స్పాట్‌ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

‘నైనీ బ్లాక్‌ ’ అనుమతులపై హర్షం

సింగరేణి(కొత్తగూడెం): ఒడిశా రాష్ట్రంలోని నైనీ బ్లాక్‌ నుంచి బొగ్గు ఉత్పత్తి చేసేందుకు అనుమతులు వచ్చిన నేపథ్యాన కేంద్ర బొగ్గుశాఖ మంత్రి కిషన్‌రెడ్డికి బీఎంఎస్‌ జాతీయ నాయకుడు పి.మాధవనాయక్‌ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం కొత్తగూడెం బీఎంఎస్‌ భవన్‌లో నిర్వహించిన యూనియన్‌ జనరల్‌ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఒడిశాలో 2015లోనే నైనీ బ్లాకు 455 మిలియన్‌ టన్నుల నాణ్యమైన బొగ్గు నిక్షేపాలు ఉన్న గనిని కేటాయించింది. కానీ గత రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం కారణంగా ఇప్పటి వరకు బొగ్గు ఉత్పత్తికి నోచుకోకపోవడంతో విషయాన్ని బీఎంఎస్‌ నాయకులు కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పర్యావరణ అనుమతులు, ఇతర పాలనాపరమైన అడ్డంకులు తొలగిస్తూ కేంద్ర మంత్రి తగిన ఉత్తర్వులు జారీ చేయించారు. ఈ నేపథ్యాన సింగరేణి సంస్థ ప్రతీ సంవత్సరం 10 మిలియన్‌ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయనున్నారు. కార్పొరేట్‌ ఉపాధ్యక్షులు జీవీ.కృష్ణారెడ్డి, ఊట్ల గణేష్‌, సంఘం చందర్‌, నాగప్రసాద్‌, రాంసింగ్‌, వినయ్‌, బి.సుందర్‌రావు, కె.శివకుమార్‌, ఉమామహేశ్వరరావు, ఐ.నాగేశ్వరరావు, శ్యాంసుందర్‌ పాల్గొన్నారు.

ఏబీసీలో ఏం చేస్తున్నారు?





కొత్తగూడెంలోని ఏబీసీ సెంటర్‌

కొత్తగూడెంఅర్బన్‌: సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్‌లో ఇటీవల కుక్కల దాడిలో ఆరేళ్ల బాలుడు మృతి చెందాడు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కూడా పిల్లలు, వృద్ధులపై కుక్కల దాడులు పెరిగిపోతున్నాయి. దీంతో బయటకు వెళ్లాలంటే భయాందోళన చెందే పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం మున్సిపాలిటీలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది. కుక్కల సంఖ్యను అదుపు చేసేందుకు ప్రభుత్వం మున్సిపాలిటీలకు ఏటా రూ. లక్షలు విడుదల చేస్తున్నా ఫలితం కనిపించడంలేదు. ఆ నిధులతో కాంట్రాక్టర్లు, ఏజెన్సీల నిర్వాహకులు జేబులు నింపుకుంటున్నారని, అందులో మున్సిపల్‌ అధికారులు, సిబ్బంది హస్తం కూడా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు.

యానిమల్‌ బర్త్‌ కంట్రోల్‌ సెంటర్‌లో అంతా గోప్యం!
- మున్సిపాలిటీల్లో పెరుగుతున్న కుక్కల స్వైర విహారం
- భయభ్రాంతులకు గురవుతున్న పిల్లలు, వృద్ధులు
- నిర్లక్ష్యం వహిస్తున్న మున్సిపల్‌ అధికారులు

కాంట్రాక్టర్‌ ఇష్టారాజ్యం!

కొత్తగూడెంలో యానిమల్‌ బర్త్‌ కంట్రోల్‌(ఏబీసీ) సెంటర్‌ను 2021 సంవత్సరంలో నిర్మాణం చేపట్టారు. మున్సిపాలిటీలోని కుక్కలను పట్టుకుని ఏబీసీ సెంటర్‌కు తీసుకొచ్చి బర్త్‌ కంట్రోల్‌ ఆపరేషన్‌, వ్యాక్సినేషన్‌ చేసి, మళ్లీ వాటిని పట్టుకున్న ప్రాంతంలో వదిలివేయాల్సి ఉంటుంది. అందుకు సంబంధించిన కాంట్రాక్ట్‌ను మున్సిపల్‌ అధికారులు హైదరాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఆ కాంట్రాక్టర్‌ ఏబీసీ సెంటర్‌కు రాకుండా ఓ బౌన్సర్‌ను ఏర్పాటు చేసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఏబీసీ సెంటర్‌లోకి జంతు ప్రేమికులను, ప్రజలను రానివ్వడంలేదు. ఎప్పుడూ సెంటర్‌కు తాళం వేసి ఉంటుందని, ఒకవేళ తెరిచినా అందులో జరిగే విషయాలను గోప్యంగా ఉంచుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

కుక్కలను పట్టుకున్నది రెండు దఫాలే..

కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీల్లో మొదటగా కుక్కల గణన చేపట్టి, వాటిని పట్టుకుని ఏబీసీ సెంటర్‌లో ఆపరేషన్‌, వ్యాక్సినేషన్‌ చేయాల్సి ఉంటుంది. కానీ ఏబీసీ సెంటర్‌ ఏర్పాటు చేసిన దగ్గర నుంచి కొత్తగూడెం మున్సిపాలిటీలో సంవత్సరానికి ఒకటి, రెండు సార్లు మాత్రమే కుక్కలను పట్టుకున్నారు. అది కూడా చిన్న కుక్క పిల్లలను, వృద్ధ కుక్కలను పట్టుకుని, ఏబీసీ సెంటర్‌లో ఆపరేషన్‌ చేసి, సమీపంలోని రైటర్‌బస్తీ, శ్మశానవాటికల్లో విడిచిపెడుతున్నారు. దీంతో చాలా కుక్కలు ఆహారం లేక, పూర్వ స్థావరాలను గుర్తించలేక చనిపోతున్నాయి.

వీధుల్లో స్వైర విహారం

మున్సిపాలిటీల్లో వీధి కుక్కల సంఖ్య బాగా పెరిగిపోతోంది. వీధుల్లో స్వైర విహారం చేస్తూ చిన్న పిల్లలు, వృద్ధులపై దాడులు చేస్తున్నాయి. ఇటీవల 27వ వార్డులో ఓ వృద్ధుడిపై కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఇలాంటి సంఘటనలు మున్సిపాలిటీల్లో అనేకం జరుగుతున్నాయి. చిన్న పిల్లలు కనిపిస్తే చాలు వారిని చుట్టుముట్టి భయాందోళనకు గురిచేస్తున్నాయి.

జంతు ప్రేమికులతో సమావేశాలేవి..?

మున్సిపల్‌ అధికారులు వారం లేదా నెలకోసారి జంతుప్రేమికుల కమిటీలతో సమావేశం నిర్వహించి, సలహాలు, సూచనలు తీసుకుని కుక్కలు, పందులు, కోతుల సంఖ్యను అదుపు చేయడానికి చర్యలు చేపట్టాల్సిన అవసరముంది. కానీ ఏబీసీ సెంటర్‌ ఏర్పాటు చేసి మూడేళ్లు గడుస్తున్నా మున్సిపల్‌ అధికారులు ఒక్కసారీ సమావేశం నిర్వహించలేదు. జంతు సంరక్షణ చట్టాలపై మున్సిపల్‌ అధికారులకు అవగాహన లేకపోవడంవల్లే ఇలా జరుగుతోందని పలువురు జంతు ప్రేమికులు పేర్కొంటున్నారు.

ఒక్కో కుక్కకు రూ.1,650

ఒక్కో కుక్కను పట్టుకుని ఆపరేషన్‌, వ్యాక్సినేషన్‌ చేస్తే ప్రభుత్వం రూ.1,650 ఏజెన్సీకి చెల్లిస్తోంది. మున్సిపల్‌ అధికారులు, కాంట్రాక్టర్‌ కుమ్మక్కై కుక్కలను పట్టుకోకుండానే బిల్లులు డ్రా చేసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అందుకోసమే ఏబీసీ సెంటర్‌లోకి ఎవరినీ రానివ్వకుండా గోప్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొంటున్నారు. దీనికితోడు ఏబీసీ సెంటర్‌ను ఇసుక డంప్‌యార్డ్‌గా మున్సిపల్‌ డ్రెయినేజీ, రోడ్ల నిర్మాణ కాంట్రాక్టర్‌ వినియోగించుకుంటున్నారు. అయినా మున్సిపల్‌ అధికారులు పట్టించుకోవడం లేదు. యానిమల్‌ బర్త్‌ కంట్రోల్‌పై కొత్తగూడెం మున్సిపల్‌ కమిషనర్‌ శేషాంజన్‌స్వామిని వివరణ కోరగా.. వీధుల్లో కుక్కలు తిరుగుతున్నట్లు మాకు ఫిర్యాదు చేస్తే వెళ్లి పట్టుకుని, బర్త్‌ కంట్రోల్‌కు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ఈసారి 65 లక్షల మొక్కలు..

- జిల్లాలో వనమహోత్సవానికి శ్రీకారం
- ప్రభుత్వ శాఖలకు లక్ష్యాల కేటాయింపు
- లాంఛనంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించిన అటవీశాఖ



మొక్కలు నాటుతున్న సిబ్బంది

చుంచుపల్లి: రాష్ట్రంలో అడవుల శాతాన్ని పెంచేందుకు ప్రభుత్వం కొన్నేళ్లుగా ఏటా హరితహారం కార్యక్రమం చేపడుతోంది. ఈసారి ప్రభుత్వం మారడంతో సరికొత్తగా వన మహోత్సవం పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఇందుకోసం పంచాయతీరాజ్‌, ఉపాధిహామీ పథకం, అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హరిత నర్సరీల్లో మొక్కలను పెంచారు. వర్షాలు ప్రారంభం కావడతో ప్రభుత్వ శాఖల వారీగా మొక్కలు నాటేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఉపాధి హామీ కూలీలతో రోడ్ల వెంట, ఖాళీ స్థలాల్లో గుంతలు తీసే ప్రక్రియ ప్రారంభం కాగా, మూడు రోజుల క్రితం జిల్లాలో వన మహోత్సవానికి అటవీశాఖ లాంఛనంగా శ్రీకారం చుట్టింది.

లక్ష్యాలు నిర్దేశం

ఇటీవల కలెక్టర్‌ జితేష్‌ వి.పాటిల్‌ అన్ని శాఖలకు మొక్కల నాటడంపై లక్ష్యాలు నిర్దేశించారు. ఈ ఏడాది జిల్లాలోని 40 శాఖల ఆధ్వర్యంలో మొత్తం 65.14 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) అన్ని శాఖల కంటే ఎక్కువగా 30 లక్షల మొక్కలు నాటనుంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గుంతలు తీయించడం, మొక్కలు నాటడం, నీళ్లు పోయించి వాటి సంరక్షణ చర్యలు చేపడుతోంది. అటవీశాఖ 10 లక్షలు, ఇతర అన్ని శాఖలు కలిపి 25.14 లక్షల చొప్పున నాటాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇక గతేడాది జిల్లాలో 9వ విడత హరిత హారంలో 65.40 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా.. 67.33 లక్షల మొక్కలు నాటారు. అప్పుడు కూడా డీఆర్డీఏ ఆధ్వర్యంలో 33.74 లక్షలు, ఇతర అన్ని శాఖలకు కలిపి 22.79 లక్షల మొక్కలు నాటించారు. జిల్లాలో ఇప్పటి వరకు జరిగిన హరితహారం కార్యక్రమాల్లో దాదాపు 11.61 కోట్ల మొక్కలను నాటారు.

జిల్లాలో తొమ్మిది విడతల్లో నాటిన మొక్కల వివరాలు (లక్షల్లో)

విడత	లక్ష్యం	నాటినవి
మొదటి	116.93	116.49
రెండో	154.12	161.33
మూడో	160.00	163.09
నాలుగో	95.00	96.17
ఐదో	154.62	146.26
ఆరో	118.14	160.29
ఏడో	104.97	135.41
ఎనిమిదో	95.62	114.63
తొమ్మిదో	65.40	67.52

శాఖల వారీగా మొక్కల కేటాయింపు



జిల్లాలో ఈ సారి వనమహోత్సవంలో భాగంగా ప్రభుత్వ శాఖల నుంచి ఎన్నెన్ని మొక్కలు నాటనున్నారో ప్రణాళికలు సిద్ధం చేశాం. వారికి కేటాయించిన లక్ష్యం ప్రకారం మొక్కలను పంపిణీ చేస్తాం. ఖాళీగా ఉన్న ప్రాంతాల్లో, రహదారుల వెంట, కార్యాలయ ఆవరణలు, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటించే కార్యక్రమాన్ని చేపడుతున్నాం. – కృష్ణాగౌడ్‌, డీఎఫ్‌ఓ

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

కలెక్టర్‌ జితేష్‌ వి.పాటిల్‌



మొక్కకు నీళ్లు పోస్తున్న కలెక్టర్‌ జితేష్‌

చుంచుపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ అన్నారు. శనివారం చుంచుపల్లి మండలం రుద్రపూర్‌ పంచాయతీలోని జిల్లా పరిషత్‌ హైస్కూల్‌లో వీఐపీ ప్లాంటేషన్‌, కిచెన్‌ గార్డెన్‌ మొక్కలను నాటారు. అనంతరం కలెక్టర్‌ మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో వెయ్యి మొక్కలు నాటే బృహత్తర కార్యక్రమం చేపట్టడం పట్ల అభినందించారు. పచ్చదనంతో వాతావరణ సమతుల్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ ఎం.విద్యాచందన, ఎంపీపీ బాదావత్‌ శాంతి, ఎంపీటీసీలు పరమేశ్వర్‌, ఆర్తి మర్నాడ్‌, ఎంపీడీఓ వి.అశోక్‌కుమార్‌, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, ఎంఈఓ జుంకీలాల్‌, పాఠశాల కమిటీ చైర్మన్‌ సుజాత, గ్రామ కార్యదర్శి వై.చెన్నకేశవ, ఉపేందర్‌, రఘుపతి, ఆగరాజు, అనిల్‌కుమార్‌, యశ్వంత్‌, కోటేశ్‌, ఆదినారాయణ, దేవదాస్‌, బాలాజీ పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు మెరుగుపడాలి

భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్‌



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ రాహుల్‌

బూర్గంపాడు/చర్ల/టేకులపల్లి: గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడాలని, అందుకోసం ప్రత్యేక శ్రద్ధ వహించాలని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్‌ అధికారి బి.రాహుల్‌ ఉపాధ్యాయులకు సూచించారు. బూర్గంపాడు, టేకులపల్లి మండలం కోయగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను శుక్రవారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లోని తరగతి గదులు, వంట గదులు, డార్మెటరీ, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా సామర్థ్యాలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రాత్రి పూట స్టడీ అవర్స్‌లో ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలని చెప్పారు. పిల్లలకు తాజా కూరగాయలతో వండిన భోజనం పెట్టాలని, కచ్చితంగా మెనూ పాటించాలని ఆదేశించారు. పాములు, తేళ్లు వంటి విషపురుగులు, జంతువులు రాకుండా పాఠశాలలు, హాస్టల్‌ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కోయగూడెం పాఠశాలల్లో పైపుల లీకేజీని గమనించి మరమ్మతులు చేయించాలని హెచ్‌ఎంను ఆదేశించారు. విద్యార్థులకు సికిల్‌ సెల్‌ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలన్నారు. అనంతరంబద్దుతండాలోని ఏకలవ్య పాఠశాలను సందర్శించి, పరిసరాలను పరిశీలించారు. శనివారం పీఓ చర్ల మండలంలో పర్యటించి, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వానాకాల సీజన్‌లో గిరిజన గ్రామాల్లో డెంగీ, మలేరియా రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలతో పాటు పాత టైర్లు, కూలర్లు, నీటితొట్లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమల మందు పిచికారీ చేయించాలని సూచించారు. కొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. విధుల పట్ల అలసత్వం వహిస్తున్న కొయ్యూరు పంచాయతీ జూనియర్‌ కార్యదర్శి ఉదయ్‌కుమార్‌కు షోకాజ్‌ నోటీస్‌ ఇవ్వాలని డీపీఓకు సూచించారు. అనంతరం కత్తిగూడెం ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ ఈదయ్య, ఏపీఓ ఎస్‌కె వలీ, హెచ్‌ఎంలు పద్మావతి, అమర్‌సింగ్‌, భూక్యా రమేష్‌, భద్రు, రవి, సునీత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఈత పోటీలకు ఎంపిక

కొత్తగూడెంటౌన్‌: కొత్తగూడెం సీఈఆర్‌ క్లబ్‌లో శనివారం రాష్ట్రస్థాయి ఈత పోటీలకు ఖమ్మం, భద్రాద్రి జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు ఉమ్మడి జిల్లా స్విమ్మింగ్‌ అసోసియేషన్‌ సెక్రటరీ జి.హనుమంతు తెలిపారు. ఈనెల 13, 14 తేదీల్లో సికింద్రాబాద్‌ జీహెచ్‌ఎంసీ స్విమ్మింగ్‌ పూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు 15 మందిని ఎంపిక చేశామని తెలిపారు. ఎంపికైన వారిలో ఖమ్మం జిల్లా జట్టులో సాయిశ్రీవాత్సవ్‌, ఎస్‌.చత్రపతినాథ్‌, బి.నాగచైతన్య, జి.మానిష్క్‌, జోహాన్‌టెడ్‌, బి.మోక్షశ్రీ, నక్షత్ర, ఎస్‌. గాయత్రి, భద్రాద్రి జిల్లా జట్టులో కె.పవన్‌, బి.తేజేష్‌, కె.కేశవ, సీహెచ్‌ మోక్ష చంద్రశేఖర్‌, ఆర్‌.ప్రతీక్‌సింగ్‌, జె.కార్తీక్‌ సుశ్వాన్‌, డి.ఆశీష్‌ వల్సన్‌ ఉన్నారు. వారిని స్విమ్మింగ్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎల్‌. నర్సింహామ్‌, ట్రెజరర్‌ ఎంసీ పాస్‌నెట్‌, జాయింట్‌ సెక్రటరీ ఆర్‌.నరహరి, కోచ్‌లు శ్యామ్యు ల్‌, సంధ్యారాణి తదితరులు అభినందించారు.

పని భారం.. భద్రత కరువు

- రోజుకు 12 నుంచి 14 గంటలు పనిచేస్తున్న ఆర్టీసీ కార్మికులు
- లెక్కకు మాత్రం 8 గంటల డ్యూటీనే..
- ఒత్తిడితో అనారోగ్యం పాలవుతున్న సిబ్బంది
- ‘మహాలక్ష్మి’తో పెరిగిన ప్రయాణికులు



ప్రయాణికులకు టికెట్లు ఇస్తున్న కండక్టర్‌

ఖమ్మంమయూరిసెంటర్‌ : సురక్షిత ప్రయాణానికి మారుపేరైన ఆర్టీసీ నేడు అనేక సవాళ్లు ఎదుర్కొంటోంది. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే కార్మికులపై మోయలేని భారం పడుతోంది. దీనికి తోడు చాలీచాలని వేతనాలు, అధికారుల వేధింపులు, పాత బస్సులు, డబుల్‌ డ్యూటీలు, పని ఒత్తిడితో అలసటకు గురవుతున్న కార్మికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. దీంతో రోడ్డుపై ఏప్పుడే ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి ఎదురవుతోంది. అధికారుల వేధింపులు భరించలేక, సెలవులు దొరకక కార్మికులు కుమిలిపోతున్నారు. కుటుంబ సభ్యులతో గడిపే సమయం కూడా దొరకడం లేదు. ఇక మహిళా కార్మికుల పరిస్థితి మరీ అగమ్యగోచరంగా ఉందని, ఎవరికీ చెప్పుకోలేని మనోవేదన అనుభవిస్తున్నారని కార్మిక నేతలు చెబుతున్నారు. పెరిగిన పని భారంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, తమ ఉద్యోగాలకు భద్రత కరువైందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్మికులపై భారం..

ఆర్టీసీ రీజియన్‌ పరిధిలో ఖమ్మం, సత్తుపల్లి, మధిర, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు డిపోలున్నాయి. ఈ ఏడు డిపోల పరిధిలో ఆర్టీసీ బస్సులు 282, హైర్‌ బస్సులు 238 ఉండగా, 865 మంది కండక్టర్‌లు, 737 మంది డ్రైవర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. రీజియన్‌లో నిత్యం 2.38లక్షల కి.మీ. మేర బస్సులు తిప్పుతున్నారు. గతంలో పల్లె వెలుగు బస్సుల్లో 160 కి.మీ. డ్యూటీ చేస్తే డే ఔట్‌ (ఒకరోజు), 300 నుంచి 360 కి.మీ. డ్యూటీ చేస్తే స్పెషల్‌ ఆఫ్‌(రెండు రోజులు) డ్యూటీగా పరిగణించేవారు. ఇప్పుడు పల్లె వెలుగులో 240 కి.మీ.కు డే ఔట్‌, 400 కి.మీ.కు స్పెషల్‌ ఆఫ్‌గా లెక్క కడుతున్నారు. ఇక ఎక్స్‌ప్రెస్‌ బస్సుల్లో గతంలో 200 నుంచి 240 కి.మీ.కు డే ఔట్‌(ఒక రోజు), 400 నుంచి 450 కి.మీ.కు స్పెషల్‌ ఆఫ్‌(రెండు రోజులు)గా ఉండగా.. ఇప్పుడు 400 కి.మీ.పైగా డ్యూటీ చేసినా డే ఔట్‌ కిందే లెక్క కట్టి గంట, రెండు గంటలు ఓటీ ఇస్తున్నారు. అంటే కార్మికులపై ఎంతమేర పని భారం పెరిగిందో తెలుస్తోంది.

అలసిపోతున్న సిబ్బంది..

ఆర్టీసీలో ఉద్యోగ విరమణలే తప్ప కొత్త నియామకాల సంఖ్య తగ్గిపోతోంది. ఉన్నవారితోనే డబుల్‌ డ్యూటీలు చేయిస్తుండడంతో కార్మికులు అలసిపోతున్నారు. తెల్లవారుజామున 4 గంటలకు డ్యూటీకి వస్తే సాయంత్రం 6 గంటల వరకు, ఉదయం 7 గంటలకు వస్తే రాత్రి 9 గంటల తర్వాతే డ్యూటీ దిగుతుండడంతో వారికి సరైన విశ్రాంతి, నిద్ర లేక అనారోగ్యాల పాలవుతున్నారు. కార్మికుల సంఖ్య తక్కువగా ఉండడంతో అలసిపోయిన వారిని సైతం అధికారులు బెదిరించి డ్యూటీలు చేయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సెలవు కావాలంటే డబుల్‌ డ్యూటీ చేయాల్సిందేనని హుకుం జారీ చేస్తున్నారు. ఇక మహిళా కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందని, వారు ఉదయం పిల్లలు నిద్ర లేవక ముందే విధులకు వచ్చి, రాత్రి పడుకున్న తర్వాతే ఇంటికి వెళ్తున్నారు. పేరుకు 8 గంటల డ్యూటీ అయినా.. 12 నుంచి 14 గంటలు పని చేయాల్సి వస్తోంది.

ఖమ్మం రీజియన్‌లో వివరాలిలా..

డిపో	బస్సులు: ఆర్టీసీ	బస్సులు: అద్దె	కార్మికులు: కండక్టర్లు	కార్మికులు: డ్రైవర్లు	ప్రతి రోజు నడిపే కి.మీ.
ఖమ్మం	67	67	231	162	57,000
మధిర	33	27	107	73	28,000
సత్తుపల్లి	41	56	152	107	41,200
భద్రాచలం	63	24	139	175	44,200
కొత్తగూడెం	29	32	97	76	26,400
మణుగూరు	31	32	100	102	33,200
ఇల్లెందు	18	00	39	42	8,000

కార్మికుల సంక్షేమంపై పట్టింపు లేదు



ఆర్టీసీలో కార్మికుల సంఖ్య తగ్గిపోతోంది. సంస్థలో ఉద్యోగ విరమణలు తప్ప.. ఖాళీల భర్తీ లేదు. 2011లో చివరిసారి ఆర్టీసీలో ఉద్యోగాల రిక్రూట్‌మెంట్‌ జరిగింది. ప్రయాణికుల రద్దీకి తగ్గట్టుగా బస్సులు, కార్మికుల సంఖ్య లేదు. ఉన్న సిబ్బందిపై పనిభారం పడుతుంది. ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదు.

– పాటి అప్పారావు, ఈయూ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి

స్పెషల్‌ ఆఫ్‌ డ్యూటీలు తీసేశారు..



ఆర్టీసీలో కార్మికులపై రెండింతల పనిభారం పెరిగింది. గతంలో 200 కిలోమీటర్ల డ్యూటీ చేస్తే స్పెషల్‌ ఆఫ్‌ ఇచ్చేవారు. మరుసటి రోజు సెలవు ఉండేది. ఇప్పుడు వాటిని ఎత్తేయడంతో పాటు కిలోమీటర్లు పెంచి కార్మికులపై పని భారం మోపారు. దీంతో కార్మికులు తీవ్ర ఒత్తిడితో అనారోగ్యం బారిన పడుతున్నారు.

– పిట్టల సుధాకర్‌, ఎస్‌డబ్ల్యూఎఫ్‌ రీజియన్‌ సెక్రటరీ

ఉచిత ప్రయాణంతో రద్దీ..

కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహాలక్ష్మి పేరుతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తోంది. దీంతో రద్దీ భారీగా పెరిగింది. 60 – 70 మంది ప్రయాణికులు ఎక్కాల్సిన బస్సుల్లో ప్రస్తుతం 100 మంది దాటుతున్నారు. ఈ ఏడాది మే లో 60,90,984 మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించగా, వీరిలో మహిళలు 35, 47,756 మంది ఉన్నారు. అయితే పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సులు, కార్మికులు లేకపోవడంతో ఉన్నవారిపైనే భారం పడుతోంది. ఇక మహాలక్ష్మితో రోజువారీగా వచ్చే నగదు తగ్గుతుండడంతో అధికారులు డబ్బుల కోసం కార్మికులపై ఒత్తిడి పెంచుతున్నారు. మహాలక్ష్మి పథకం డబ్బు ప్రభుత్వం నుంచి మంజూరయ్యేవరకు కార్మికుల వేతనాలు, డీజిల్‌, ఇతర నిర్వహణ ఖర్చులు కూడా వెళ్లే పరిస్థితి లేదని, డబ్బు చెల్లించి టికెట్‌ తీసుకునే ప్రయాణికుల సంఖ్య పెంచాలని కౌన్సెలింగ్‌ ఇస్తున్నారు. ఇలా అధికారుల ఒత్తిడి, ప్రయాణికుల రద్దీ మధ్య కార్మికులు నలిగిపోతున్నారు.

క్లుప్తంగా

నాటిన మొక్కలను సంరక్షించాలి

అదనపు కలెక్టర్, డీఆర్‌డీఓ విద్యాచందన



మొక్క నాటుతున్న విద్యాచందన

పాల్వంచరూరల్: దైవ సన్నిధిలో మొక్కలు నాటడం అంటే దేవుడికి పూజలు చేసినట్లే అవుతుందని అదనపు కలెక్టర్, డీఆర్‌డీఓ విద్యాచందన అన్నారు. శనివారం మండల పరిధి జగన్నాథపురంలోని పెద్దమ్మగుడి వద్ద వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆలయ సన్నిధిలో మామిడి, కొబ్బరి, ఉసిరి మొక్కలను నాటడం భవిష్యత్‌లో భక్తులకు ఉపయోగపడనున్న నేపథ్యాన నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. అనంతరం మొక్కలను తెప్పించిన ఎంపీడీఓను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్.రజనీకుమారి, ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి, ఎంపీఓ నారాయణ, ఏపీఎం రాంబాబు, ఐబీ డీఈ రాణి, ఏపీఓ పొరండ్ల రంగా, కార్యదర్శి సాయిరాం, ఈజీఎస్ సిబ్బంది పుల్లయ్య, శ్రీను, శంకర్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి పోస్టులకు 20, 21 తేదీల్లో రాత పరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న 272 పోస్టులకు ఈ నెల 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లో కంప్యూటర్ ద్వారా రాత పరీక్ష నిర్వహించనున్నట్లు జీఎం పర్సనల్(ఆర్సీ) బీఆర్ దీక్షితులు తెలిపారు. ఈ ఏడాది జనవరిలో విడుదల చేసిన మొదటి ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ (1/2024) రాత పరీక్షకు సంబంధించి సింగరేణి వెబ్‌సైట్ https://scclmines.com ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, అభ్యర్థుల మెయిల్ ఐడీకి కూడా లింక్ పంపినట్లు తెలిపారు. పోస్టులు ఇప్పిస్తామని దళారులను నమ్మి మోసపోవద్దని, ఎవరైనా ఫోన్ చేసినట్లు తెలిస్తే సింగరేణి విజిలెన్స్‌కు సమాచారం ఇవ్వాలని సింగరేణి సీఅండ్‌ఎండీ ఎన్.బలరామ్ సూచించారు.

బాల కార్మికులతో పని చేయిస్తే చర్యలు

మైనర్లతో పని చేయించిన ఇద్దరిపై కేసు..

సుజాతనగర్: బాల కార్మికులతో పని చేయిస్తున్న ఇద్దరిపై శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా మండల కేంద్రంలో కొత్తగూడెం అసిస్టెంట్ లేబర్ అధికారి ఎండీ షర్ఫుద్దీన్ ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో ఓ బైక్ మెకానిక్ షెడ్‌లో 16 ఏళ్ల బాలుడు, వస్త్ర దుకాణంలో 17 ఏళ్ల యువతి పనిచేస్తున్నట్లు గమనించి..మెకానిక్ షెడ్ యజమాని సాయిన్ని నాగరాజు, వస్త్ర దుకాణ యజమాని మల్లెల శ్రీనివాసరావు అనే ఇద్దరిపై కేసు నమోదు చేశారు. బాల కార్మికులచే వెట్టి చాకిరీ చేయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

ఫోన్ ధర చెల్లించండి

ఖమ్మంలీగల్: డబ్బులు పెట్టి ఆన్‌లైన్‌లో ఫోన్ కొంటే ఫోన్ చార్జర్ మాత్రమే వచ్చింది. దీంతో ఫిర్యాదుదారునికి నష్టపరిహారం చెల్లించాలని ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్ వి.లలిత, సభ్యురాలు ఎ.మాధవీలత తీర్పునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరానికి చెందిన మహబూబ్‌అలీ 2022లో రెడ్ మీ సెల్‌ఫోన్‌ను ఆన్‌లైన్‌లో రూ.18,298 చెల్లించి బుక్ చేసుకున్నాడు. సెల్‌ఫోన్‌బాక్స్ రాగా దానిని ఓపెన్ చేయగా చార్జర్, పౌచ్ మాత్రమే ఉండటంతో ఫిర్యాదుదారుడు ఆన్‌లైన్ కంపెనీకి ఫోన్ చేయగా వారి నుంచి సరైన స్పందన రాకపోవడంతో జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌కు నివేదించారు. ఈ కేసును పరిశీలించిన కమిషన్ కంపెనీ నిర్లక్ష్యం ఉందని నిర్ధారించి ఫిర్యాదుదారుడికి ఫోన్ డబ్బులు రూ.18,298, నష్టపరిహారం కింద రూ.10,000, కోర్టు ఖర్చుల నిమిత్తం మరో రూ.10,000 చెల్లించాలని తీర్పునిచ్చారు.

ఆటోడ్రైవర్‌పై కత్తితో దాడి..

సింగరేణి క్వార్టర్స్‌లో ఖాళీ చేయించాడనే కక్షతో...

కొత్తగూడెంటౌన్: గతంలో జరిగి గొడవను దృష్టిలో పెట్టుకుని ఓ వ్యక్తిపై ఇంట్లోనే కత్తితో దాడి చేసి గాయపరిచిన సంఘటన శనివారం కొత్తగూడెం టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గౌతంపూర్‌లో నివాసం ఉంటున్న ఆటోడ్రైవర్ సాహూ ఈశ్వర్‌ను అదే ప్రాంతానికి చెందిన సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుడు అరికె రమేష్ ఇంట్లోకి ప్రవేశించి కత్తితో దాడి చేశాడు. ఈక్రమంలో ఇంట్లో ఉన్న కుటుంబసభ్యులు వారించే లోపు రమేష్ పరారయ్యారు. గతంలో గౌతంపూర్‌లోని సింగరేణి క్వార్టర్స్‌లో నివాసం ఉండే వారు. ఆ సమయాన రమేష్, ఈశ్వర్ అతడి భార్యతో గొడవలు పడుతుండడంతో పెద్ద మనుషుల మధ్య పంచాయతీ నిర్వహించి ఒకరి జోలికి ఒకరు రాకుండా రాజీ కుదిరింది. అయితే రమేష్‌ను క్వార్టర్స్‌లో ఉండకుండా సింగరేణి అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆ క్వార్టర్‌ను ఖాళీ చేయించారని మనస్సులో ఉంచుకుని గొడవకు వచ్చినట్లు తెలిపారు. రమేష్ పరారీలో ఉండగా.. గాయపడిన ఈశ్వర్‌ను కుటుంబసభ్యులు కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానాస్పత్రికి, ఆపై ఖమ్మంకు తరలించారు. ఈశ్వర్ తల్లి సాహూ చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్‌కుమార్ తెలిపారు.

శ్లోకమే శ్వాసగా..



సత్తుపల్లి గీతా జ్ఞాన మందిరంలో శ్లోకాలు పఠిస్తున్న మహిళలు

సండే స్పెషల్

- వంటింట్లో ఉంటూనే.. పఠనంలో నెగ్గారు..
- గీతా శ్లోక పఠనంలో 25 మంది మహిళలకు బంగారు పతకాలు

సత్తుపల్లిటౌన్: అంతా వివాహితులే.. నిత్యం సంసార జీవితంతో బిజీగా గడిపే ఈ మహిళలు ఏడాది కాలంలోనే 700 శ్లోకాలు పఠించారు. అవలీలగా అప్పగించి ఔరా అనిపించారు. ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన భగవద్గీత శ్లోక పఠనంలో పోటీ పడి ఏకంగా బంగారు పతకాలు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు.

పఠించటమే వారి లోకం..

ఒక్క శ్లోకం చెప్పడమే చాలా కష్టంగా ఉంటుంది. అలాంటిది భగవద్గీతలోని 18 అధ్యాయాల్లోని 700 శ్లోకాలను తడబడకుండా పఠించారు. శ్వాసను ఆపుతూ వందల శ్లోకాలను ఏకధాటిగా చెప్పటం అంత సులభం కాదు. అయితేనేం ఈ గృహిణులు శ్లోకాలను అలవోకగా చెపుతూ అబ్బురపర్చుతున్నారు. భక్తిభావాన్ని నరనరానా జీర్ణించుకుని శ్లోకాలను పఠించారు. శ్లోకంలో ఒక భాగం అడిగితే మిగతా శ్లోకాలను అవలీలగా చెప్పడం వీరి ప్రత్యేకత.

టెలీగ్రామ్ యాప్‌తో..

ఆలయాల్లో జరిగే పూజా కార్యక్రమాల్లో ముందుండే సత్తుపల్లికి చెందిన ఈ మహిళలు భగవద్గీత శ్లోకంపై పట్టు సాధించాలని తపించారు. మైసూర్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద స్వామి ఆధ్వర్యంలో దత్తపీఠంతో పాటు గీతా పరివార్, గీతా మకరందం గ్రూప్‌ల సహకారంతో శ్లోకాలు నేర్చుకున్నారు. ఇందుకోసం టెలీగ్రామ్ యాప్‌లో చేరి ఆన్‌లైన్‌లోనే శ్లోకాలను కంఠస్తం చేసే విధానంపై శిక్షణ పొందారు. ఇలా 15 రోజులకోసారి 30 శ్లోకాల చొప్పున చూడకుండా వీడియోకాల్‌లో అప్పగించేవారు. ఇలా 700 శ్లోకాలను ఎక్కడ అడిగినా, ఏ పాదం అడిగినా తడబడకుండా చెబుతూ ప్రపంచ వ్యాప్త శ్లోకపఠన పోటీల్లో నెగ్గి శభాష్ అనిపించుకున్నారు. ఇటీవల మైసూర్ దత్తపీఠాధిపతి శ్రీగణపతి సచ్చిదానంద స్వామిజీ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్, సర్టిఫికెట్లు అందుకున్నారు. ఖమ్మం, సత్తుపల్లిలోని ఆలయ కమిటీలు శ్లోక పఠనం గోల్డ్‌మెడల్ విజేతలను సత్కరించడంతో పాటు అభినందన కార్యక్రమాలు నిర్వహించాయి.

చాలా ఆనందంగా ఉంది



కుటుంబ సభ్యుల సహకారంతో భగవద్గీత శ్లోక పఠనం నేర్చుకున్నా. ఇంటి పని చూసుకుంటూనే శ్లోకాలను ఆన్‌లైన్‌లో నేర్చుకున్నా. ఎంతో మందితో పోటీ పడి నెగ్గడం ఆనందంగా ఉంది. స్వామిజీ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ తీసుకోవడం చాలా అదృష్టంగా భావిస్తున్నా.

– అద్దంకి అశ్విని, సత్తుపల్లి

ఎక్కువ సమయం కేటాయించా



భక్తితో భగవద్గీత శ్లోకాలను నేర్చుకున్నాం. చాలా ఇష్టంగా ఎక్కువ సమయం కేటాయించా. మైసూర్ దత్తపీఠం వారి ఆధ్వర్యాన ఈ శ్లోకాలను పఠించడం, ఫైనల్ పరీక్షల్లో కూడా విజయం సాధించడం చెప్పలేని ఆనందాన్ని కలిగించింది.

– వేముల శ్యామల, సత్తుపల్లి

ఏడాది కాలంలోనే..



గీతా పరివార్ గ్రూప్‌లో చేరి భగవద్గీత శ్లోకాలను ఆన్‌లైన్‌లో నేర్చుకున్నా. ఏడాదిలోనే 700 శ్లోకాలను కంఠస్తం చేసి అప్పగించానంటే నాకే ఆశ్చర్యం కలిగింది. గతంలో అవార్డు సాధించిన భార్గవి స్ఫూర్తితో పఠనం చేసి విజయం సాధించా.

– టి.వాసంతి, బెంగళూరు

చాలా సంతోషంగా ఉంది



గోల్డ్ మెడల్ సాధించడం చాలా సంతోషంగా ఉంది. బాల్యంలో చదివినట్టుగానే పోటీపడి నేర్చుకున్నాను. 32 నిమిషాల్లో 156 గీతాశ్లోకాలు అప్పగించడం ద్వారా విజయం సాధించి గోల్డ్‌మెడల్, సర్టిఫికెట్ సాధించా. స్వామీజీ చేతుల మీదుగా అందుకోవడం మర్చిపోలేని అనుభూతి.

– కంభంపాటి ఉమాదేవి, సత్తుపల్లి

'సీతారామ' తరలింపు తగదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మధు, ఐలయ్య

ఇల్లెందు: జిల్లాలో ప్రవహిస్తున్న గోదావరి జలాలను ఇతర ప్రాంతాలకు తరలించడం తరలించడం సరికాదని రెండు ఎన్డీ పార్టీల (ఎస్‌వీ వర్గం- వైకే వర్గం) రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, గౌని ఐలయ్యలు డిమాండ్ చేశారు. శనివారం ఇల్లెందులో వారు విలేకరులతో మాట్లాడారు. గతంలో ప్రతీ ఎకరాకు నీరందుతుందని చెప్పి 2016లో రోళ్లపాడులో సీతారామ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి రీ డిజైన్ పేరుతో ఖమ్మం జిల్లాలోని పాలేరు, సత్తుపల్లి, ఖమ్మం లాంటి ప్రాంతాలకు నీటిని తరలించేందుకు కుట్రలు చేశారన్నారు. ప్రాజెక్టును మూడు సార్లు 'రీ'డిజైన్ చేసినా రోళ్లపాడు ప్రాజెక్టు లేకుండా పోయిందని, కాలువలకు మాత్రమే టెండర్ జరిగిందన్నారు. మూడు జిల్లాల పరిధిలోని 24 మండలాల్లో 6 లక్షల ఎకరాలకు నీరు అందించే ప్రాజెక్టు సీతారామ ఉంటుందని ప్రకటించి 2018లో రూ.13,384 కోట్లతో రీడిజైన్ చేశారన్నారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతానికి సాగు నీరు ఇవ్వాలన్నారు. రోళ్లపాడులోనే ప్రాజెక్టు నిర్మించాలని అఖిలపక్షంతో కలిసి ఆందోళనలు నిర్వహిస్తామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎన్డీ నేతలు తుపాకుల నాగేశ్వరరావు, కె.సారంగపాణి, తోడేటి నాగేశ్వరరావు, పొడుగు నర్సింహారావు, మోకాళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం

పాల్వంచ: ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఆన్‌లైన్ ద్వారా నగదు స్వాహా చేశాడు. పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని నటరాజ్‌సెంటర్‌కు చెందిన ఎండీ దారిక్ రిఫై ఈ ఏడాది మార్చిలో ఆన్‌లైన్‌లో ఉద్యోగం కోసం వెతుకుతుండగా అజయ్ వ్యక్తి పరిచయమయ్యాడు. ఈ క్రమంలో నగదు పంపిస్తే ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి పలు దఫాలుగా మొత్తం 18 సార్లకు కలిపి రూ.2.35 లక్షలు ఆన్‌లైన్‌లో నగదు బదిలీ చేశాడు. రెండు నెలలు గడిచినా ఎలాంటి ఉద్యోగం కల్పించకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎస్‌ఐ బి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'సాక్షి' సిబ్బందికి వైద్య పరీక్షలు



సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల గ్రామంలో ఉన్న సాక్షి దినపత్రిక కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి హైదరాబాద్ మలక్‌పేట యశోద, ఖమ్మం శరత్ మాక్సి విజన్ ఆస్పత్రుల సౌజన్యంతో వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరాన్ని సాక్షి యూనిట్ మేనేజర్ మోహన్‌కృష్ణ ప్రారంభించి మాట్లాడారు. నిత్యం పని ఒత్తిడిలో ఉంటున్న సిబ్బంది కోసం యాజమాన్యం ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసిందని తెలిపారు. అనంతరం యశోద ఆస్పత్రి వైద్యులు జాన్‌బాబు, డాక్టర్ ప్రతిభ సారథ్యంలో గుండె సంబంధిత వ్యాధులకు ఈసీజీ, 2–డీ ఎకో పరీక్షలతోపాటు కంటి పరీక్షలు నిర్వహించి కళ్ల అద్దాలు అవసరమైన వారికి రిఫర్ చేశారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సాక్షి ప్రొడక్షన్ మేనేజర్ నవీన్, సర్క్యులేషన్ మేనేజర్ ప్రదీప్, సాక్షి టీవీ కరస్పాండెంట్ మహేందర్, వివిధ విభాగాల ఇన్‌చార్జ్‌లు శ్రీనివాసాచారి, రాంబాబు, కిరణ్, జగన్, కృష్ణారెడ్డి, సతీశ్, రాజు, శరత్ మాక్స్ విజన్ సిబ్బంది విక్రమ్‌సింగ్, దేవేందర్, యశోద ఆస్పత్రి సిబ్బంది శ్రీధర్, దుర్గ, మమతతోపాటు సబ్‌ఎడిటర్లు, ప్రొడక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యుడు, పక్కన సాక్షి బీఎం మోహన్‌కృష్ణ తదితరులు

పెద్దతోగు బీట్ ఆఫీసర్ సస్పెన్షన్

గుండాల: అక్రమ కలప రవాణా విషయంలో విచారణ అనంతరం మండలంలోని పెద్దతోగు బీట్ ఆఫీసర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఇటీవల కాచనపల్లి రేంజ్ పరిధిలోని పెద్దతోగు బీట్‌లో టేకు చెట్లను నరికి ట్రాక్టర్‌లో ఇల్లెందుకు తరలించే క్రమంలో కొమరారం చెక్ పోస్టు వద్ద బోల్తా పడింది. అయితే కలప రవాణాపై ఆ బీట్ ఆఫీసర్‌పై అనేక ఆరోపణలు రావడంతో అధికారులు వారం రోజుల పాటు విచారణ జరిపారు. పై స్థాయి అధికారులకు సమాచారం ఇవ్వకుండా రాత్రి పూట తరలించడంతో పూర్తిస్థాయి విచారణ చేపట్టిన తర్వాత ఆ బీట్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేశారు. సస్పెన్షన్ వేటు వాస్తవమేనని, ఆర్డర్ కాపీలు వస్తే బీట్ ఆఫీసర్‌కు అందిస్తామని ఇల్లందు ఎఫ్‌డీఓ వెంకన్న తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

సుజాతనగర్ : పురుగుమందు తాగిన మహిళ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఎస్సై జుబేదాబేగం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాత అంజనాపురం గ్రామానికి చెందిన సింధు(27)కి అదే గ్రామానికి చెందిన మర్రా రాజుతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం కాగా సింధు అమ్మవారింట్లోనే కలిసి ఉంటున్నారు. గత రెండు రోజుల క్రితం వేరే కాపురం పెట్టుకుందామని రాజు తన భార్యతో అనడంతో ఇరువురి మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈక్రమంలో మనస్తాపానికి గురైన సింధు శుక్రవారం పురుగుల మందు తాగగా గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి శనివారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బావిలో పడి వృద్ధుడి...

అన్నపురెడ్డిపల్లి: బావిలో పడి ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన అన్నపురెడ్డిపల్లి గ్రామ శివారులో చోటు చేసుకోగా, శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ రాజా మహ్మద్(70) మూడేళ్ల క్రితం నుంచి కంటి చూపు కనపడక ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈక్రమంలో ఈ నెల 3వ తేదీన తన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, శనివారం గ్రామ శివారులోని బావిలో అతడి మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై ఎస్సై చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.


పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

దుమ్ముగూడెం: కుటుంబ కలహాల నేపథ్యాన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని పెద్ద కమలాపురంలో చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలను ఎస్‌ఐ గణేశ్ ఇలా తెలిపారు. గ్రామానికి చెందిన వర్స సాయిబాబు (20) గత రెండు రోజుల నుంచి తన భార్యతో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల సమయాన ఆయన పొలంలో పురుగుల మందు తాగి పడిపోయి ఉన్నాడు. దీన్ని గమనించిన సమీప రైతు వర్సా పడగరాజు బంధువుల సహాయంతో భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో భార్యాభర్తల మధ్య గొడవల నేపథ్యాన క్షణికావేశంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తల్లి మందలించిందని యువతి...

అశ్వాపురం: మండలంలోని పాములపల్లి గ్రామానికి చెందిన కూరం కృష్ణవేణి (23) ఇంట్లో తల్లి మందలించిందని మనస్తాపానికి గురై శుక్రవారం అర్ధరాత్రి పురుగుమందు తాగింది. దీంతో కుటుంబసభ్యులు మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైలు పట్టాలపై నిల్చుని వ్యక్తి...



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కొత్తగూడెంఅర్బన్: రైలు వస్తున్న సమయాన పట్టాలపై నిల్చుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. హేమచంద్రపురం రైల్వే గేట్ సమీపంలో శుక్రవారం రాత్రి సుమారు 11:15 గంటల సమయాన ఒక గుర్తు తెలియని వ్యక్తి (34), భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ నుంచి డోర్నకల్ వైపు వెళ్తున్న మణుగూరు ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురుగా వచ్చి రైలు పట్టాలపై నిలుచున్నాడు. ఈక్రమంలో రైలు అతడిని ఢీకొట్టడగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు చామనచాయ రంగు, కోళ ముఖం, బట్టతల, నలుపు– తెలుపు రంగు టీ షర్ట్, తెలుపు రంగు పాయింట్ ధరించి ఉన్నాడని గుర్తించి డిప్యూటీ/స్టేషన్ మేనేజర్ ఫిర్యాదు మేరకు రైల్వే ఎస్‌ఐ పి.భాస్కరరావు(ఇన్‌చార్జ్) కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో భద్రపరచగా, మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 58589, 94947 90619 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

అన్నపురెడ్డిపల్లి: ఆర్థిక పరమైన ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి మృతి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని జానకీపురం గ్రామానికి చెందిన పిట్టల లక్ష్మయ్య(45) వ్యవసాయం చేస్తుండేవాడు. ఇటీవల అతడి తండ్రి అనారోగ్యానికి గురికావడంతో వైద్యానికి అప్పులు చేయాల్సి వచ్చింది. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురై శనివారం గ్రామ శివారులోని తన వ్యవసాయ క్షేత్రంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో అతడి కుటుంబసభ్యులు పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

పది అడుగులకు చేరిన పెదవాగు



పెదవాగు ప్రాజెక్టులోకి చేరిన వరదనీరు

అశ్వారావుపేటరూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని గుమ్మడవల్లి సమీపంలో గల పెదవాగు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరుతోంది. గురు, శుక్రవారాల్లో కురిసిన భారీ వర్షంతో ఎగువ ప్రాంతాల్లోని వాగుల నుంచి ప్రాజెక్టులోకి వరద నీరు పోటెత్తింది. దీంతో నిన్నటి వరకు వెలవెలబోయిన ప్రాజెక్టు ఇప్పుడు జలకళ సంతరించుకుంది. పెదవాగు ప్రాజెక్టు కింద అశ్వారావుపేట మండలంతోపాటు, ఏపీలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో 16వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 19.3 అడుగులు కాగా, నీటి నిల్వ సామర్థ్యం 0.6 టీఎంసీలు.

ప్రస్తుతం 10 అడుగుల మేర నీరు చేరగా 0.3 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఇరిగేషన్ ఏఈఈ కేఎన్‌బీ కృష్ణ తెలిపారు. ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

41 కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

ఇల్లెందు/ఇల్లెందురూరల్: ఒరిస్సా నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని ఇల్లెందు పోలీసులు అరెస్టు చేశారు. సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్నమయ్య జిల్లాకు చెందిన మల్లు వేణుగోపాల్‌రెడ్డి అనే వ్యక్తి ఓ కారులో ఒరిస్సా నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తుండగా మండలంలోని సుదిమళ్ల స్టేజీ వద్ద ఎస్సై సందీప్ వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుకున్నారు. అనంతరం తనిఖీ చేయగా.. 41 కిలోల గంజాయి లభించడంతో దాన్ని స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా, నిందితుడు హైదరాబాద్‌లో నివాసం ఉంటూ హైదరాబాద్‌లోని దూల్‌పేటకు తరలిస్తున్నట్లు అంగీకరించడంతో సొమ్ము చేసుకునే ప్రయత్నాన్ని పోలీసులు విచ్ఛిన్నం చేశారు.

గంజాయి మత్తులో మైనర్లు

పిల్లలు గంజాయి తీసుకుంటున్నారనే సమాచారంతో తల్లిదండ్రుల దాడి

చంద్రుగొండ : మండలంలోని తుంగారం గ్రామంలో చిన్న పిల్లలు గంజాయి మత్తులో తూగుతున్నారు. స్థానిక వెంగళరావు కాలనీలో ఓ ఇంట్లో కొందరు పిల్లలు శనివారం గంజాయి తీసుకుంటుండగా తల్లిదండ్రులు ఆ ఇంటిని చుట్టుముట్టి దేహశుద్ధి చేశారు. కాగా, గంజాయి మత్తులో ఉన్న ఓ యువకుడు గ్రామస్తులపైనే దాడికి దిగాడు. ఈ ఘటనతో ఆందోళన చెందిన పిల్లల తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించగా ఎస్‌ఐ ఇద్దరు యువకులను అదుపులో తీసుకున్నట్లు సమాచారం. ఏడో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి గంజాయి సేవించడంతో పాటు నిత్యం కొత్తగూడెం నుంచి టీవీఎస్ వాహనంపై తానే తీసుకొచ్చి అందరికీ సరఫరా చేస్తున్నట్టు తల్లిదండ్రుల ఎదుట అంగీకరించాడు.